“భలే వుంది. త్వరలో పొట్టి కథల పోటీ పెడుతున్నాం. దానికి రాయి. మా ఎడిటర్‌గారికి నేనే స్వయంగా అందజేస్తాలే...... ”

“థాంక్స్. ఏదో వేడిలో వ్రాయాలనిపించింది కానీ ఆ మ్యాచ్ చూసి సాయంత్రం వచ్చేసరికి ఈ ఆవేశం వుండకపోవచ్చేమో. బైదిబై రాజు ఏవంటున్నాడు?”.

“ఏ బోయ్‌ఫ్రెండ్ అయినా ఏమంటాడు? చెల్లెలి పెళ్ళి అవ్వాలట. ఒక సంవత్సరం వరకూ ఆగమంటాడు. ఉంటానేం బై ...” ఫోన్ పెట్టేసింది.

ఫ్రాన్స్ -ఇండియా డేవిస్‌కప్ సెమీఫైనల్స్‌కి అది ఆఖరిరోజు.

అంతకుముందు నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. రెండు సింగిల్సూ ఇండియా గెల్చింది. డబుల్స్ లోనూ, రివర్స్ సింగిల్స్ లోనూ ప్రత్యర్థి దేశం గెలిచింది.

అంటే ......

ఇప్పుడు ఆడబోతూన్న అయిదో గేమ్ ఏ దేశస్థుడు గెలిస్తే ఆ దేశం ఫైనల్స్‌కి చేరుకుంటుందన్న మాట.

అంతా టెన్షన్.

ఆ రెండో రివర్స్ సింగిల్స్ చూడడానికి టెన్నిస్ అభిమానులందరూ అక్కడికి చేరుకోవటంతో ఆ ప్రదేశమంతా కిటకిటలాడుతోంది.

లక్ష్మి దాదాపు పావుగంట నిలబడింది. భర్త రాలేదు. ఆమెకది మామూలే. చెప్పిన టైమ్‌కి అతడు ఎప్పుడూ రాడు. వచ్చి (అసలంటూ వస్తే) ఏదో అర్జెంటు పనుందనీ ఆగిపోయాననీ చెబుతాడు. అదీ మామూలే.

మరో అయిదు నిమిషాలు గడిచాయి. అందరూ ఆమెనే చూస్తున్నారు. అది ఆమెకి చాలా ఇబ్బందిగా తోచింది. జుట్టుకి బాగా నూనె పెట్టి బిగించి కట్టినా కూడా

ముంగురులు ఎగురుతూనే వున్నాయి. అంతలో ఆమెకి తన భర్త లోపలికి వెళ్ళి కూర్చున్నాడేమో అని అనుమానం కలిగింది.

తనకోసం అతను లోపల వెతుకుతున్నాడేమో అని అనుమానం రాగానే ఆమెకూడా లోపలికి వెళ్ళింది. వంద జతల కళ్ళు ఆమెను అనుసరించాయి. పైట నిండుగా కప్పుకుని ఒద్దిగ్గా ఒక మూల కూర్చుంది. చాలా చిన్న బాక్స్ అది. భర్త లేడు.

వస్తాడన్న అశని మనసులో నింపుకుని ఎదురు చూడసాగింది. మరో అయిదు నిమిషాలు మళ్ళీ అదే వంటరితనం. చుట్టూ అందరూ ఆనందంగా-

ఇంతలో ఒక్కసారిగా చప్పట్లు. ఆమె ఆలోచనల నుంచి తెప్పరిల్లి చూసింది. భారతదేశపు ఆటగాడు ప్రహసిత్ గ్రౌండ్‌లోకి ప్రవేశిస్తున్నాడు.

ఆరు అడుగుల ఎత్తు ...... చక్కని శరీర సౌష్టవం ...... కొనదేలిన ముక్కు ...... ఇవి కాదు ...... అతడిలో కొట్టొచ్చినట్టు కనపడేది - పట్టుదల! ప్రత్యర్థిని గెలవాలనే పట్టుదల అతడిలో కొట్టొచ్చినట్లు కనపడుతోంది.

అక్కడున్న ఆడవాళ్ళలో చాలామంది అతన్ని తినేసేట్టు చూస్తున్నారు. ఈ మ్యాచ్ గురించి క్రితంరోజే ఒక ప్రముఖ పత్రిక వ్యాసం వ్రాసింది. ప్రహసిత్ గురించి వ్రాస్తూ అతడు టెన్నిస్‌ని హాబీగా ఎన్నుకోవటంవలన సినిమా రంగం ఒక అందమైన నటుడిని కోల్పోయినట్టు వ్రాసింది.

అందులో అతిశయో క్తి ఏమీలేదు.

ప్రహసిత్ డాక్టర్. అయినా టెన్నిస్ మీద వున్న ఇంటరెస్ట్‌తో దీంట్లో కృషి చేసి నేషనల్ ప్లేయర్ అయ్యాడు. ఇప్పుడు భారతదేశపు ఆశలన్నీ అతడిమీదే వున్నాయి.

ఆట మొదలైంది. ఫస్ట్ సర్వీస్ ప్రహసిత్‌దే.

ఏస్ సర్వీస్.

చప్పట్లు.

15..0 తో ప్రారంభమైంది.

రెండోది ప్రత్యర్థి సాధించాడు. 15..15.

మొదటి సెట్‌నుంచే టెన్షన్ ప్రారంభమైంది. అందరూ నిశ్శబ్దంగా చూస్తున్నారు.

ఫ్రాన్స్ దేశపు ప్రత్యర్థి కూడా సామాన్యుడు కాదు. వరల్డ్ రాంకింగ్ వున్నవాడు.

లక్ష్మికి వంటిల్లు గుర్తొచ్చింది. స్టౌమీద రసం పెట్టింది. వస్తూ వస్తూ తను స్టౌ ఆర్పిందా లేదా అన్న అనుమానం. క్షణాల్లో అది పెనుభూతమైంది. తాము ఇంటికి వెళ్ళేసరికి గిన్నె ఏ షేపులో వుంటుందా అన్న భయం.

ఈ మధ్య ప్రతీ చిన్న విషయానికి విపరీతంగా ఆలోచించటం అలవాటైపోయింది. వంట మనిషిని పెట్టుకొమ్మని విష్ణు అంటాడు. తనకి ఇష్టం లేదు. ఇంటి పనంతా స్వంతంగా చేసుకుంటేనే ఇంకా బోలెడు తీరిక. అటువంటిది మరీ ఖాళీగా వుంటే ఈ ఆలోచన్లు చంపేస్తాయి. రాత్రి ఎనిమిదింటికి పనంతా అయిపోతే ఇక భర్త వచ్చే అర్థరాత్రి వరకూ ...... ఆ తీరిక (?) ఎంత బాధాకరమో ఆమెకు అనుభవపూర్వకంగా తెలుసు.

ఆకస్మాత్తుగా వళ్ళో ఏదో వచ్చి బలంగా పడటంతో ఆమె ఉలిక్కిపడింది. చుట్టూ గోల.

ప్రహసిత్ చేసిన సర్వీస్‌ని ప్రత్యర్థి ఆపుచేయబోతే బ్యాట్‌కి తగిలి, ఆ బంతి వచ్చి ఆమె ఒళ్ళో పడింది.

ఆమెకు విపరీతమైన సిగ్గేసింది అందరి దృష్టి తన మీదే పడటంతో ...... తనలో తాను కుదించుకుపోతూ బంతిని కుర్రాడివైపు విసిరేసింది.

సరిగ్గా అదే సమయానికి ప్రహసిత్ ఆమెని చూశాడు. అతడొక క్షణంపాటు అది ప్లే గ్రౌండ్ అనీ, తను ఇండియా తరపున డేవిస్‌కప్ మ్యాచ్ ఆడుతున్నాననీ మర్చిపోయాడు.

ఒక అందమైన యువకుడిగా, డాక్టర్‌గా, దేశాన్ని రిప్రజెంట్‌చేసే టెన్నిస్ ప్లేయర్‌గా, అతనంటే పడి చచ్చే స్త్రీలూ, అమ్మాయిలూ చాలామంది. కానీ ...... ఇరవై అయిదేళ్ళ జీవితంలో మొట్టమొదటిసారి అతను, తనంత తానుగా ఒక స్త్రీని చూసి చలించిపోవటం జరిగింది.

జనం ఇంకా గోల చేస్తూనే వున్నారు. "క్వయిట్ ప్లీజ్" అంటున్నాడు అంపైర్.

ప్రహసిత్ ఆమెను చూస్తూనే వున్నాడు. ఇంకా చూస్తూనే వున్నాడు. అది టీనేజి ఆకర్షణ కాదని అతనికి తెలుస్తోంది.

వజ్రకరూర్ కొండల్లో ఏళ్ళతరబడి వెతగ్గా వెతగ్గా వజ్రం దొరికిన భావం. అంతలో ప్రత్యర్థి తన సర్వీసు కోసం ఎదురుచూస్తున్నాడని స్ఫురణకు వచ్చి తనను తాను కంట్రోలు చేసుకుంటూ సర్వీస్ చేశాడు.

'నెట్' అయింది. ఆమె వైపు చూశాడు. ఆమె చుట్టూ చూస్తోంది. ఆమె ముందు వరుసలో కూర్చుని వుండటంతో స్పష్టంగా కనిపిస్తోంది.

సాధారణంగా ఇలాంటి టెన్నిస్‌మ్యాచ్‌ల్లో ప్రేక్షకులు ఎక్కువసేపు కూర్చోవాల్సి వస్తుంది.

అందుకని పూర్తిగా వెనక్కి జారబడో, కాలుమీద కాలు వేసుకునో రిలాక్స్‌డ్‌గా కూర్చుంటూ వుంటారు. ఆమె అలా కాకుండా చాలా పొందిగ్గా, ఒద్దికగా, పూవులా కూర్చుని వుంది. చాలా సేపట్నుంచి ...... అలాగే తల ఒంచుకుని... అప్పుడప్పుడు ఆటకేసి చూస్తూ.

ఒళ్ళో రెండుచేతులూ పెట్టుకుని కాస్త కదిలితే కూడా పక్కవాళ్ళు చూస్తారేమో అన్న బిడియంతో, బుట్టబొమ్మలా కూర్చున్న ఆమెవైపు ఆ గంటలోనూ దాదాపు వందసార్లు చూసి వుంటాడు ప్రహసిత్.

ఆకస్మాత్తుగా పెద్దగోల వినిపించటంతో ప్రహసిత్ ఈ లోకంలోకి వచ్చాడు. జనం చప్పట్లు కొడుతున్నారు. గోలగోల చేస్తున్నారు.
కారణం ఏమిటా అని స్కోరు బోర్డు వంక చూశాడు.

స్కోరు 4..6,  6..7,  6..2 , 6..2,  5...1,

ప్రహసిత్ అదిరిపడ్డాడు. ప్రత్యర్థి ...... ప్రపంచపు ర్యాంకింగ్ వున్నవాడని తెలుసు. అయినా అతడిపై మొదటి రెండుగేములూ అతి కష్టంమీద గెలవగలిగాడు. కానీ ఆ తరువాత..?

ఓడిపోతున్నందుకు బాధలేదు. ఓడిపోతున్నట్టు కూడా తెలియనంతగా వంటిమీద స్పృహ లేకుండా ఎలా ఆడుతున్నాడు? అసలు తన స్పోర్ట్స్ జీవితంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇదేమీ ఆషామాషీ ఆట కాదు.
ఒక దేశపు పరువుకి సంబంధించిన విషయం. బహుశ ఏ క్రీడాకారుడి జీవితంలోనూ ఇది జరిగివుండదు.
పెవిలియన్‌లో కూర్చున్న ఒక స్త్రీవల్ల ఆటలో ఏకాగ్రత కోల్పోవటం. అతడికి సిగ్గేసింది. తన మీద తనకే కోపం వచ్చింది.

"డ్యూస్" అరిచాడు కామెంటేటర్.

అదీ ఓడిపోయాడు

అడ్వాంటేజి ఫ్రాన్స్‌కి....

మ్యాచ్ పాయింట్?

ఈ ఆఖరి సర్వీస్‌తో భారతదేశం డేవిస్‌కప్ పోటీలనుంచి శాశ్వతంగా తప్పుకోవాల్సి వస్తుంది. అతడికి  దుఃఖం కలిగింది.

సరిగ్గా అదే సమయానికి ఆమె కుర్చీలోంచి లేచింది. తలవంచుకుని, కుర్చీల మధ్య సందుల్లోంచి జాగ్రత్తగా నడుస్తూ బయటకు వెళ్ళిపోయింది.

తన ఓటమి చూడలేక ఆమె వెళ్ళిపోయిందా?

అతని వేదన మరింత ఎక్కువైంది? కానీ అంతలోనే మరొక అందమైన వూహ కలిగింది.

తనలో ఆమె కలిగిస్తున్న సంచలనాన్ని ఆమె గుర్తించిందన్న మాట! ఆ వూహ అతడిలో కొత్త ఉత్సాహాన్ని రేపింది.

ప్రేమ ప్రథమ దశలో ఎప్పుడూ అంతే. అవతలివారి ప్రతి చర్యా మనకి అనుగుణంగానే భావించుకునేలా చేస్తుంది. నిజానికి, ఆమె భర్త కోసం చూసి చూసి ఇక భరించలేక వెళ్ళిపోయింది. ముందే చెప్పినట్టు క్రీడా ప్రపంచానికీ భావుకత్వానికి అసలు పొసగదు.

తన ఏకాగ్రత కోసం ఆమె ఆ ఆటని వీక్షించటం త్యాగం చేసిందని అతడు భావించగానే చేతుల్లోకి బలాన్నీ పెదవుల మధ్యకి పట్టుదలనీ, కళ్ళలోకి తీక్షణతనీ తెచ్చుకున్నాడు.

అదే ఆఖరిసెట్ అవటంతో ఇద్దరిమధ్యా హోరాహోరీ పోరాటం జరుగుతోంది.

వరుసగా 4 గేమ్స్ గెలిచాడు 5..5.

ప్రేక్షకులు ఆగకుండా గోల చేస్తున్నారు. 5..6... 6..6...

ఒకర్నొకరు ఓడించుకోవాలని శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.

12...13.

ఆమె లేచి వెళ్ళిపోయిన ఖాళీ కుర్చీ కూడా ప్రేరణ ఇస్తోంది.

13...14...

ఉత్కంఠ ఎక్కువై జనం కుర్చీల్లోంచి లేచి నిలబడ్డారు. ప్రహసిత్ ఎడమ చేతితో బాల్ విసిరి, కుడిచేతిలోని బ్యాట్‌తో బలంగా కొట్టాడు.

......ఏస్....

ఒక్కసారిగా చుట్టూ హర్షధ్వానాలు. అతడు రెండు పిడికిళ్ళూ బిగించి ఆనందంగా గాలిలో లేచాడు. 13....15తో ఆ విధంగా ఆఖరిసెట్ గెలిచి, సిరీస్‌లో ఆధిక్యత సంపాదించాడు.

బహుమతి ప్రదానం జరుగుతోంది. అప్పుడు కూడా అతను ఆ కుర్చీ వైపే చూస్తున్నాడు.

చివరి క్షణంలోనైనా ఆమె వస్తుందనుకున్నాడు. ఆమె రాలేదు. ఆమె ఎప్పుడో వెళ్ళిపోయిందని అతడికి తెలీదు.

దేన్నైనా దాచుకోవడానికి ఈ ప్రపంచంలో అన్నిటికన్నా విశాలమైనదీ భద్రమైనదీ హృదయం. అటువంటి హృదయంలోనే చోటు ఇమడక ఆనందం అతడి హృదయంలోంచి చిర్నవ్వు రూపంలో తన్నుకొచ్చింది.

లక్ష్మి నిస్త్రాణగా పడుకుని వుంది. కడుపులో శూలంతో గుచ్చినట్టు నొప్పి ఉండి ఉండి వస్తోంది.

నెలకొకసారో రెండుసార్లో ఇలా నొప్పి వస్తూ వుంటుంది. ఎక్కువయితే తప్ప పక్కమీదనుంచి లేవకుండా వుండదు.

అతడికి కాఫీ, టిఫిను ...... అన్నీ మామూలుగా జరిగిపోతూ వుంటాయి.

ఆరోజు మరీ నొప్పి ఎక్కువగా వుండటంతో ప్రొద్దున్నే పక్కమీదనుంచి లేవలేకపోయింది.

అతను ప్రొద్దున్నే ఎనిమిదింటికి మామూలుగా లేచి బ్రష్ చేసుకుని వచ్చేసరికి డైనింగ్ టేబుల్ మీద కాఫీ లేదు. అతడు కంగారుగా లోపలికి వచ్చాడు.

"ఏమిటి? హెల్త్ బావోలేదా?" అని అడిగాడు.
"అవునండీ"
"ఒట్టి కడుపునొప్పేనా?"
"ఊ"?

“నువ్వు రెస్ట్ తీసుకో. నేను హోటల్‌నుంచి టిఫిన్ తెప్పించుకుంటాలే. భోజనం కూడా బయటే చేస్తాను. నీకు బోయ్‌తో క్యారియర్ పంపిస్తాను” అంటూ అతడు లోపలికి వెళ్ళాడు.

ఆ తరువాత ఫ్యామిలీ డాక్టర్‌కి ఫోన్ చేయటం వినిపించింది “...నేనే ....విష్ణుని ... తనకి కడుపునొప్పి అట....ఆ ..అదే మామూలే... ఏమిటి? బరాల్‌గనా? ...ఓకే....ఆబ్బెబ్బె..ఏంలేదు...”

ఫోన్ పెట్టేసిన చప్పుడు.

అతడు స్నానం చేసి తయారయి డ్రెస్సింగ్ టేబిల్ దగ్గిర తల దువ్వుకున్నాడు. సన్నగా విజిల్ చేస్తూ పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకుని బయల్దేరుతూ “వెళ్ళొస్తాను. నొప్పి మరీ ఎక్కువగా వుంటే డాక్టర్‌గ్గానీ నాగ్గానీ ఫోన్ చెయ్యి” అన్నాడు.

ఆమె కళ్ళు మూసుకుని వుంది.

ఆ తరువాత గేటు తీసి వేసిన చప్పుడు.

క్షణం తరువాత వాహనం వెళ్ళిపోయిన చప్పుడు.

అతడు సన్నగా విజిల్‌వేసిన  ధ్వని ఇంకా ఆ గదిలో వినిపిస్తూనే వుంది. సెంట్ పరిమళం గాలిలో కదలాడుతూంది. చాలా మామూలుగా...భార్య వున్నా, పడుకున్నా పెద్దతేడా లేనట్టుగా వి...జి....ల్... అదీ ఆమెను బాధ పెట్టింది.
చాలా చిన్న చిన్న విషయాలే రంపపు ముళ్ళయి మనసుని పరపరా కోస్తాయి. అతడు తన పక్కన కూర్చుని హడావుడి చెయ్యనవసరం లేదు. డాక్టర్‌ని పిలిచి కంగారు పెట్టనవసరం లేదు. కాఫీ, భోజనం ఏర్పాటు చేయడమే కర్తవ్యంగా భావించి, తన మానాన తన పనులు చేసుకుపోవటం ...... అదీ బాధ ...... దానికి తోడు...ఆ...వి..జి...ల్...

ఒక కల పూర్తి కాకుండానే సూర్యుడు వుదయిస్తూంటే నెమ్మదిగా ఆవిరైపోయే హిమ బిందువు లాంటిది నా జీవితం. పిల్లల్ని కనటం పెద్ద చేయటం.